విజయనగర సామ్రాజ్య పతనానికి కారణమైన తళ్లికోట యుద్ధ నేపథ్యంలో జరిగిన సంఘటనల ఆధారంగా రాసిన ప్రేమకథా కల్పన. భవిష్యత్తును ఊహించే అసాధారణ శక్తి, స్త్రీ సహజ దుర్బలత్వంతో ఉండే ఒక ఆడపిల్ల ప్రేమ కల. రాగద్వేషాలు, భావోద్వేగాల మధ్య సాగే కథా, కథన నిర్మాణం.


3

ఝాన్సీ పాపుదేశి

# ఏకపర్ణిక

నర్సిం





నిర్మానుష్యమైన నగరం.

చుట్టూ కోసులకొద్దీ విస్తరించి ఉంది. ఎక్కడా ఎలాంటి అలికిడి లేదు. మనసులో ఏదో ఆందోళన.

ఆమె ఒక్కర్తై. ఎవరి కోసమో వెదుకుతూ ఉంది. చుట్టూ నిలువెత్తు రాళ్లు, కొండమీద అక్కడక్కడ ఏవో మంటపాలూ గుళ్లూ.

దూరంగా గలగలమని శబ్దం. ఏదో నది... రాళ్లూరప్పలూ తొక్కుతూ నురగలు కక్కుతూ ప్రవహిస్తోంది. సంధ్యకాంతులు ఆకాశాన్ని వర్ణరంజితం చేస్తున్నాయి. ఆమె ప్రమేయం లేకుండానే కాళ్లు అటు కదిలాయి. వేగంగా పడుతున్న అడుగులు కాస్తా పరుగందుకున్నాయి. కనువిందు చేస్తున్న ప్రకృతిలో తడుస్తూ, నదీ ప్రవాహ సంగీతంలో మనసును ఐక్యం చేసి ఆమె నదివైపు పరుగిడుతోంది.

ఎంత పరుగెత్తినా దూరం తగ్గడం లేదు. మనసులో అలజడి మరింత ఉధృతం అవుతోంది. కనులు వెదుకులాట ఆపలేక పోతున్నాయి.

ఎవరి కోసం? ఆమె మనసుకి తెలియడం లేదు.

వెనుకకి తిరిగి చూసింది. ఏదో కూలిపోయిన గుడి. దానిపక్కనే కాలి బూడిదైన కుటీరం. ఇంకా పొగలు చిమ్ముతూనే ఉంది. వాటిని చూస్తుంటే ఆమె మనసులో ఏదో కోల్పోయిన బాధ. అంతలోనే ఎందుకో తెలియని ఊరట. కాసేపు అంతా చీకటి.

మళ్లీ వెదుకులాట.

ఎవరికోసం? ఆమె మనసు ఆమెను ప్రశ్నిస్తోంది. ఎవరు? ఎవరు?

నది ఒడ్డున ఒంటరి రావిచెట్టు. ఆత్మీయునిలా పలకరిస్తున్నట్లు ఉంది. ఆందోళన నుంచి కాస్తంత ఉపశమనం. చల్లని గాలి తెమ్మెర. పసుపుపచ్చని పండుటాకు ఆ గాలిలో తేలుతూ తనవైపే వస్తోంది. ఎగిరి దానిని అందుకుంది.

ఆ రావి ఆకుపై ఏదో పురుషాకృతి. వీపు మాత్రం అస్పష్టంగా కనుల ముందు క్షణమాత్రం మెదిలింది.

ఆమె మనసు చెప్పింది తను వెదుకుతున్నది అతడి కోసమేనని. ఉద్వేగంతో ఆ ఆకును గుండెలకి హత్తుకుంది. మళ్లీ కళ్లముందు ఉంచుకొని మరోసారి అతడెవరో చూడాలని ప్రయత్నించింది. కానీ కళ్లలో పొరలు కట్టినట్లుగా ఏదో మసక. ఆందోళన అధికమయింది. గుండెలు ఎగసేలా ఏదో తెలియని బాధ. ఊపిరి అందడంలేదు.

ఆ చిత్రంలోంచి అతడు వెనుదిరిగి చూసాడు. పెదవులు కదిలాయి. ఏదో పిలుపు. కానీ మాట వినబడలేదు.

ఉలిక్కిపడి లేచింది. కల కరిగిపోయింది. కానీ గుండె దడ మాత్రం చాలా సేపు తగ్గలేదు.

అది ఊహ తెలిసిన నాటి నుంచీ ఆమెను విడిచిపెట్టని కల.

*

'రేపు మనం విజయనగరానికి పోతున్నాం, సిద్ధంగా ఉండు.'

సిద్ధుడి మాటలు ఆమెని ఏదో తెలియని ఆందోళనకు గురిచేసాయి.

విజయనగరం.

ఆ పేరు తలుచుకుంటేనే ఆమె గుండె లయ తప్పుతోంది.

నెలరోజుల తర్వాత వాళ్లు ప్రయాణిస్తున్న బిడారు ఆనెగొందెను సమీపించింది. చుట్టూ కొండరాళ్లు, చెట్లూ చేమలు చిరకాలంగా తెలిసిన బంధువుల్లా ఆమెని పలకరించాయి. అక్కడి గాలిలో కూడా ఏదో తెలియని చుట్టరికం. మనసులో మాత్రం ఆనంద పరవశం. వడివడిగా సాగే పంపానదిని చూడగానే అమెకి చిన్ననాటి స్నేహితురాలిని చూసిన అనుభూతి కలిగింది.

సిద్ధుడిని అక్కడే వదలి నదీతీరం వైపు పరుగుతీసింది. నదీజలాల్లో చేతులు ఆడిస్తూ, ఆ నీటిని దోసిట పట్టి పెదవులతో ముద్దాడుతూ తన్మయత్వంగా చాలాసేపు అలానే ఉండిపోయింది.

"అదిగో, నదికి అవతల వున్నదే విజయనగరం. రాయల రాజధాని," అంటూ పక్కన నిలిచాడు సిద్ధుడు.

తలెత్తి చూసింది. ఎదురుగా కొండ! తన కలలో ప్రతిరోజూ కనిపించే కొండ. కొండ అంచున గుడి. కాస్త దూరంగా నది ఒడ్డున రావిచెట్టు. ఏదో అతీతమైన భావావేశం. ఎన్నాళ్లగానో వెదుకుతున్నదేదో కళ్ల ముందు ప్రత్యక్షమైనట్లు హృదయ స్పందన వొక్కసారిగా రెట్టింపైంది. నిస్త్రాణగా కూలబడిపోయింది.

ఊహ తెలిసినప్పటి నుంచీ ద్రిమ్మరిలా సిద్ధుని వెంట ఎన్నో దేశాలు, ప్రదేశాలు తిరిగింది. కానీ కలల్లో మాత్రమే కనిపించే దృశ్యం కంటి ముందు సాక్షాత్కరించింది. ఇదే నీ గమ్యం అని మనసు పదేపదే చెప్పింది. ఆమె కళ్లు చుట్టూ వెదికాయి. తన కలలోని పురుషాకృతి కంటపడతాడని ఆశ.

కానీ ఎదురువచ్చినా గుర్తించేదెలా?

కలలో వచ్చింది అస్పష్టమైన రూపం. అందునా వెనుక నుంచి. ఎందుకో ఆమె మనసు మాత్రం అతడు నిజంగానే వస్తాడని, ఈ ద్రిమ్మరి బతుకు నుంచి విముక్తి చేసి తనకు చేయందించి తీసుకువెళ్తాడని చెప్తోంది.

అలా ఎదురుచూపులతోనే ఏడాది గడిచిపోయింది.

*

నది ఒడ్డున మౌనంగా కూర్చొని ఉంది.

సంధ్యకాంతులలో ఆ పంపాతీరపు సౌందర్యాన్నంతా మనసునిండుగా నింపుకుంటుంటే ఒక పల్చటి బాధావీచిక ఆమెలో. మోయలేని విరహానుభూతి పొందినప్పుడల్లా తోడుగా వచ్చే ఈ బాధ అనుభవమే ఆమెకు. అప్పుడప్పుడే యవ్వనంలోకి ప్రవేశిస్తున్న ఆమెకి చిన్ననాటి నుంచీ కలలు గన్న పురుష రూపం ఊహల్లో జొరబడి తరచూ అల్లరి పెడుతుంది. అతడి సాంగత్యం కావాలనిపిస్తుంది.

అతడిని పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని ఒక ఆలిగా, ఇల్లాలిగా సాధారణ జీవితాన్ని గడపాలని కోరుకుంది. కానీ తాను కోరుకుంటున్న జీవితం ఎలా చేజిక్కించుకోవాలో అర్థంకాదు.

అతడెక్కడున్నాడో తెలియదు.

ఎక్కడైనా కనిపించకపోతాడా అని విజయనగర వీధులన్నీ వెదికింది. పండగలకి, వేడుకలకి నగరానికి వచ్చే లక్షలాదిమందిలో అతడు కూడా రాక పోతాడా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసింది. చివరకు ఏనాడో ఒకనాడు అతడే వస్తాడులే అని తన మనసుని సమాధానపర్చుకుంది. వచ్చి తనను సిద్ధుని వద్ద నుంచి అపహరించుకుని పోయినట్టు ఊహించుకుంటూ పగటి కలలు కంటూ కాలం గడపసాగింది.

దూరంగా రవికాంతులతో బంగారురంగులో మెరిసిపోతున్న పంపాపతి ఆలయ సౌందర్యం చూస్తూ త్వరగా తన కోరిక తీర్చమని మనసులోనే నమస్క రించుకుంది. చీకటితెరలు కమ్ముకోవడం ప్రారంభం కాగానే మెల్లగా లేచి హేమకూట పర్వతంలోని తన కుటీరానికి బయలుదేరింది. ఆమె కళ్లు సంధ్యవేళ అందాన్ని నింపుకుంటే మనసు నదీప్రవాహపు హోరుతో ఇంకా ప్రతిధ్వనిస్తోంది.

అడవిమల్లెంత స్వచ్ఛంగా, అందంగా ఉంటుందామె. దానికి తగినట్టే ఆమె రూపురేఖలు కూడా ఆ ప్రాంతపు ప్రజలకి భిన్నంగా ఉంటాయి. ఆమెకు తన తల్లిదండ్రులెవరో, తనది ఏ ప్రాంతమో తెలియదు. పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచి ఆమె సిద్ధుని పంచనే ఉంది. ఆయనే తండ్రి, దైవం. భయభక్తులు, కృతజ్ఞత ఆమె ప్రతి కదలికలోనూ కనిపించేవి. సిద్ధుడు ఆమెను చాలా దూరప్రాంతం నుంచి ఎత్తుకొచ్చేశాడని చెప్పుకుంటారు. తన తల్లిదండ్రులెవరని పలుమార్లు సిద్ధుడ్ని ప్రశ్నించినా సమాధానం రాకపోవడంతో ఆమె ఆ ప్రయత్నం మానుకుంది.

సిద్ధునితోబాటు ఏడాది క్రితం హేమకూట పర్వతం చేరుకుంది. కొండ అంచున కాళికాలయం వద్ద చిన్న కుటీరం ఆమె నివాసం. వశీకరణం, అంజనం, పరుసవేది విద్యల్లో ఆరితేరిన సిద్ధునికి శిష్యురాలు. సిద్ధుని దర్శనం కోసం సాధారణ ప్రజల కంటే రాయల కొలువులో ఉండే రాజవంశీకులు, నాయకులు, అధికారులు ఒకరికి తెలియకుండా ఒకరు సిద్ధుని వద్ద కొస్తుంటారు.

అలాగే అతడు కూడా ఒకనాడు రాకపోతాడా?

వస్తాడని మనసు చెప్తోంది. ఒకవేళ వచ్చినా గుర్తించేదెలా?

చిన్ననాటి నుంచీ సిద్ధుని కోసం వచ్చిన వాళ్ల వెనుకగా కూర్చొని, వాళ్లు వాళ్ల కోరికలను, సమస్యలను చెప్పుకుంటుంటే వింటూ వారి రూపాలను మనః ఫలకంపై పదిలపర్చుకుని తర్వాత రాలిపడ్డ రావి ఆకులపై వాటికి స్పష్టమైన రూపం ఇవ్వడానికి ప్రయత్నించేది. వాటిని కలలోని పురుషాకృతితో పోల్చుకునేది.

అలా ఆమె రూపమిచ్చిన అస్పష్ట చిత్రాలు ఆమెతో మాట్లాడేవి. అవి ఆమె కలల్లోకి వచ్చి వాటి భవిష్యత్తు చెప్పేవి. సిద్ధుడు అన్నాళ్లుగా ఆమెని పెంచి పోషించింది అందుకే. ఆమె నుంచి వాటిని రాబట్టి తనను సంప్రదించ వచ్చిన వారికి భవిష్యత్తు చెబుతూ అతీంద్రియ శక్తులున్న సిద్ధునిగా మంచి పేరు గడించాడు. పైకి మాత్రం ఆమె సిద్ధుని తాంత్రిక పూజలకు అవసరమైన సామగ్రిని అమర్చిపెట్టే శిష్యురాలు మాత్రమే.

*

విజయనగరంలో ఒక సిద్ధుడు తన శిష్యురాలితో కలిసి హేమకూట పర్వతానికి వచ్చినట్టు తెలిసిన గండికోట రాజ్యపు మహామండలేశ్వరుడు పెమ్మసాని తిమ్మానాయకుడు అతడిని దర్శించుకునేందుకు పరివారంతో సహా వచ్చాడు. కొన్ని సమస్యలకు పరిష్కారం దొరకడంతో కొద్దిరోజుల్లోనే ఆ సిద్ధునికేవో అతీత శక్తులున్నాయని నమ్మడం ప్రారంభించాడు. సిద్ధుడు ఏవో తాంత్రిక పూజలు జరిపిస్తున్నాడు. పరివారాన్ని దూరంగా ఉంచి గుడిలోకి వెళ్లాడు.

పూజకు కావల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసేసి నది ఒడ్డున కూర్చొని ఆలోచనలో పడిందామె.

ఆరోజు ఎందుకో ఆమె మనసేదో చెప్తోంది. ఎడమకన్ను అదురుతోంది. కలలలోని పురుషాకృతి పదేపదే కళ్ల ముందు మెదుల్తోంది. రాలుతున్న ప్రతి ఆకూ ఆమెకు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది. అతడు త్వరలోనే వస్తాడనీ తనకు ఆ జీవితం నుంచి విముక్తి ఇస్తాడనీ తుంగభద్ర సవ్వడులు చేస్తోంది. విజయనగరం చేరుకున్న నాటినుంచి తన కల నిజమయే రోజులు వచ్చాయని అర్థమై ఆమె మనసు మనసులో లేదు. సిద్ధుడు చేసే తాంత్రిక పూజలు ఆమెకు రోత పుట్టిస్తున్నాయి. అర్ధరాత్రి పూజలూ, రక్తార్పణలూ వెగటు పుట్టిస్తున్నాయి. ఒంటరితనం భయపెడుతోంది.

ఎన్నాళ్లిలా?

అతడు వస్తాడా? నన్ను చేబడతాడా? తన గురించి తెలిసి కూడా పెళ్లి చేసుకోవడానికి ముందుకొస్తాడా?

సమాధానంగా ఒక పండుటాకు గాలిలో ఊగులాడుతూ వచ్చి ఆమె వడిలో వాలింది. రాలిపడిన బంగారు రంగు రావిఆకులపై మంజిష్ట వేరుతో నూరిన ఎర్రటి రంగుతో ఆమె కనులలో మెదులుతున్న రూపాన్ని గీయడానికి పూనుకుంది. ఆ రంగు ఆమె కొనవేళ్లకు అంటి మైదాకు పూసినట్లు మెరుస్తోంది.

'రావిఆకులతో పూజలా? దేనికోసమో?'

తదేకంగా చిత్రాన్ని గీస్తూ పరిసరాలు మర్చిపోయిన ఆమె వులిక్కిపడి మాటలు వినిపించిన వైపుగా చూసింది.

అతడి పేరు మాధవుడు. గండికోట రాజ్యంలో పినాకినీ తీరంలోని వెంపర్ల విషయానికి పాలెగాడు. పెమ్మసాని తిమ్మానాయకునికి దగ్గర బంధువు. ఐదువేల విలుకాళ్ల గండికోట అశ్విక సైన్యానికి దళపతి. యువకుడు. నాయకుని వెంట ఆ గుడికి రావడం అదే మొదటిసారి.

ప్రకృతిని ఆస్వాదించి సోలిపోయిన ఆమె కళ్లను, ఆమె చేతిలో వున్న రావి ఆకులను, ఎరుపెక్కిన మునివేళ్లను చూస్తూ, 'చిత్రకళలో ప్రవీణురాలవే! నీవెవరు? నీ పేరేమిటి?' దగ్గరగా వస్తూ అడిగాడు.

తలెత్తి అతడిని చూసింది. ఆ క్షణమే అర్థమైంది. అతడే! తన కలలలోని పురుషుడు. తన స్వప్నసుందరుడు. కలా! నిజమా! కనులు విప్పార్చి అతడినే చూస్తూ ఉండిపోయింది.

ఆమె అందం సామాన్యమైంది కాదు.

సాయంసంధ్యలో బంగారు రంగులో మెరిసిపోయే హేమకూట పర్వతానికి దీటైన మేనివర్ణం. లేడికళ్లు. ఎత్తైన చెక్కిళ్లు. కుదురైన చుబుకం. చాలా సుకుమారంగా నాజూకుగా ఉంది. అంతటి సుకుమారి రాజమందిరాల్లో సర్వ భోగాలూ అనుభవిస్తూ ఉండాలి. ఇక్కడ ఈ కొండకోనల్లో ఏం చేస్తోంది?

''పిల్లా! నీవెవరు? నీ పేరేమిటి?'' మరోసారి అడిగాడు.

ఆ ప్రశ్నతో లోకంలోకి వచ్చింది. పేరు. ఆమె పేరేమిటో ఆమెకే తెలియదు. సిద్ధుడి శిష్యురాలిగా లోకానికి తెలుసు. సిద్ధుడు ఎప్పుడూ ఆమెను పేరుతో పిలవలేదు. ఏదైనా అవసరమైతే 'అమ్మీ' అని పిలుస్తాడు. బయటవాళ్లకి ఆమె పేరుతో అవసరం లేదు.

మాటాపలుకూ లేకుండా అతడినే చూస్తూ ఉండిపోయింది. ఊరూ పేరూ లేని ద్రిమ్మరిని, నేనెవరని చెప్పను? పేరేమని చెప్పను? అనుకుంటూ కనులు దించుకుంది.

పాపం! మూగదేమో? అనుకున్నాడతడు. 'ఇక్కడేం చేస్తున్నావ్?' సైగలతో అడిగాడు.

''సిద్ధస్వామి శిష్యురాలిని,'' బదులు పలికింది.

''అరే! మాటలొచ్చే, మరి పేరు చెప్పవేం?''

అంతవరకూ అతడి బొమ్మే గీస్తున్న రావి ఆకును చేతికందించింది.

ఇదొక ప్రహేళిక కాదుకదా? అనుకున్నాడతడు.

''సరే! నీవు చెప్పకపోతే నేనే నీకొక పేరు పెట్టుకుంటాను,'' అంటూ ఆమె చేతికందించిన రావి ఆకును తీక్షణంగా చూస్తూ, ''ఏకపర్ణిక... ఈ పేరెలా ఉంది? బాగుందా?''

''ఏ... క... ప... ర్ణి... క,'' ఒక్కొక్క అక్షరాన్ని ఆస్వాదిస్తూ పలికిందామె. పలుకు పలుకుకీ ఆమె ముఖం పద్మంలా విచ్చుకుంది. అనిర్వచనీయమైన ఆనందం. పదే పదే వచ్చే తన కలలో ఆ పేరు పలుకుతున్న అతడి పెదవుల కదలిక తాను ఎన్నిసార్లు చూసిందో!

''ఏకపర్ణిక.''

*

మాధవుడికి తాంత్రికపూజలపై నమ్మకం లేదు. నాయకుని మాట కాదనలేక మొదట అయిష్టంగానే వచ్చినా ఏకపర్ణిక కంటబడ్డాక ఇప్పుడు ఆమెకోసమే వస్తున్నాడు.

తిమ్మానాయకునితో పాటు సిద్ధుని దర్శనార్థమై వచ్చే మాధవుడి కోసం క్షణాలు యుగాల్లా ఎదురుచూసేది ఏకపర్ణిక. మాధవుడిని చూసినప్పుడు ఆమెలో జన్మాంతర మోహం పొంగుతుంది. కళ్లు కలిపినప్పుడు అగ్నికి ఆజ్యం పోసినట్టవుతుంది ఆమెలో కోరిక. యాదృచ్ఛికంగా తాకీతాకనట్లుగా అతడి మునివేళ్లు తాకుతూ మైమరచిపోతుంది. 'ఏకపర్ణికా...' అతడి పిలుపు విన్నంతనే ఆమె హృదయ స్పందన పెరుగుతోంది. శరీరం సంతులనం కోల్పోతోంది. చెక్కిళ్లు ఎరుపెక్కుతాయి. పెదవులు కారణమేమీ లేకుండానే విచ్చుకుంటాయి.

ఇంతకాలం ఎదురుచూసింది ఆ స్వప్నసుందరుడి కోసమే కాదా!

మాధవుడూ ఆమెను కొనచూపుతో కొలుస్తుంటాడు. దేవకన్యలా కనిపించే ఏకపర్ణిక సిద్ధుని దగ్గర కాకుండా మరెక్కడైనా ఎదురుపడినట్లయితే ఎప్పుడో ఎత్తుకుపోయేవాడే. రాజప్రాసాదపు స్త్రీలలా ఆమె తలవంచుకుని, లేని గౌరవం, సిగ్గు అభినయించదు. చాలా ఆత్మవిశ్వాసంతో వుంటుంది. సూటిగా మాట్లాడుతుంది. ఒక్క సిద్ధునికి తప్ప మరెవరికీ భయపడుతున్నట్లు కనపడదు. ఎలాగైనా ఆమెను సొంతం చేసుకోవాలన్న కోరిక ఏకపర్ణికను చూసినప్పుడంతా మరింత బలపడుతుంది అతడిలో.

కానీ తల్లిదండ్రులెవరో, కులమేదో తెలియని యువతిని రాచకుటుంబాలలోకి ఆహ్వానించడం అంత తేలికైన పనేమీకాదు. పైగా సాధారణ ప్రజల దృష్టిలో ఆమె ఒక మంత్రగత్తె.

ఆరోజు కాళికాలయంలో ఏకపర్ణిక కనిపించకపోవడంతో అసహనంగా బయటకు వచ్చి నిల్చున్నాడు మాధవుడు. గుర్రాన్ని మెల్లగా నడిపిస్తున్నట్టుగా కుటీరం దగ్గరగా వెళ్లి ఆమెకోసం వెదికాడు. ఎక్కడా అలికిడి లేదు. ఎక్కడికెళ్లిందో! ఏకపర్ణికతో ఒంటరిగా మాట్లాడాలని అవకాశం కోసం చూస్తున్న మాధవుడు, తిమ్మానాయకుడు సిద్ధునితో పూజల్లో నిమగ్నమవగానే ఆమెను వెదుక్కుంటూ నదివైపు వచ్చాడు.

చేయాల్సిన పనులేమీ లేకపోవడంతో ఏకపర్ణిక నది ఒడ్డున కూర్చుని మాధవుని చిత్రం గీస్తోంది. గుర్రపునాడాలను పట్టుకుని వీపు మాత్రమే కనిపించేలా నిలుచున్న మాధవుడి చిత్రం గీస్తూ విశాలమైన వీపుపై ఆమె వేళ్లు ఆగిపోయాయి. కొంటె ఊహలతో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

మాధవుడు వచ్చిన అలికిడికి వెనుదిరిగి చూసింది.

"ఏకపర్ణికా! ఈ తాంత్రికుని వద్ద ఎంతకాలం ఒంటరిగా వుంటావు? నీకంటూ ఒక జీవితం వద్దా? నీ అందం నా మతిపోగొడుతోంది. నీ స్థానం ఇక్కడ కాదు. ఇదుగో ఇక్కడ," అంటూ వక్షస్థలాన్ని చూపించాడు. "నిన్ను మొదటిసారి చూసినప్పుడే నాలో ఇష్టం మొదలైంది. కేవలం నిన్ను చూడటం కోసమే ఏదో ఒక పని కల్పించుకుని ఈ నగరంలో ఉండిపోయాను. నువ్వు కూడా నన్ను ఇష్టపడ్డట్టు నా హృదయానికి తెలుస్తోంది. చెప్పు, నేనంటే నీకిష్టమేనా?" ఆమె మొహాన్ని తనవైపు తిప్పుకుంటూ అడిగాడు.

"నేను మిమ్మల్ని అంగీకరించాలంటే మీరు నాకొక మాట యివ్వాలి," మెల్లగా అంది ఏకపర్ణిక.

"ఏమిటో అది? నేను సిద్ధమే," చెప్పాడు మాధవుడు.

"నన్ను వివాహం చేసుకోవాలి. ఈ జీవితం నుంచి నాకు విముక్తి కావాలి."

"ఇంత చిన్న కోరిక తీర్చలేని నా ప్రేమెందుకు? నువ్వు ఇక నాదానివి. నిన్ను వివాహం చేసుకుంటాను. అందుకు అందరినీ ఒప్పిస్తాను. నాకు కొంత సమయమివ్వు," చిన్నగా నవ్వి ఏకపర్ణిక చేతిలో చెయ్యేసి ప్రమాణం చేశాడు.

అది మొదలు మాధవుడూ, ఏకపర్ణిక ప్రేమలో ప్రపంచాన్నే మర్చిపోతున్నారు. పంపానదీ ఒడ్డున శృంగారంలో మునిగి తేలుతున్నారు. ఇద్దరూ ఒకే రూపమై, ఒకే ప్రాణమై హేమకూటమంతా తిరుగాడుతున్నారు. నెమళ్లతో ఆడుతూ, వెన్నెల్లో తడుస్తున్నారు. ఆమె సిగ్గు నిండిన దరహాసం చంద్రవంకలా వుంటే దాన్ని సొంతం చేసుకున్న మాధవుడు మదనసుందరుడయ్యాడు. శివ పార్వతుల ప్రేమకోసం మన్మథుడు భస్మమైన చోటది. ఆ మదనుడి సామ్రాజ్యమే వారి సొంతమయింది. వారిద్దరి చుట్టూ అదే ప్రేమ సుగంధంలా నిండిపోయింది. ఇంతకుముందులా రంగుల ఆకాశాన్ని, నదీజలాల సవ్వడిని ఆమె తనలో నింపుకోవడం లేదు. మాధవుడే ఆమెను నిలువెల్లా ఆక్రమించి వున్నాడు.

మాధవుడు తనను కలవడానికి రానిరోజు ఆమె కళ్లలో చీకట్లు నిండిపోయేవి. కాలం కరకుగా మారిపోయేది. ఇక జీవితం అంతమైపోతున్నట్టు అనిపించేది. మనసంతా దుఃఖపడేది. ఎప్పుడెప్పుడు తనను వివాహం చేసుకుని ఇక్కడి నుంచి తీసుకెళ్లిపోతాడా అనే ఎదురుచూపుల్లోనే కాలం గడుపుతోంది ఏకపర్ణిక.

అలా మూడు రుతువులు గడిచిపోయాయి.

*

శాలివాహనశకం 1486, రక్తాక్షి నామ సంవత్సరం. ఉగాది సంబరాలతో ఊరంతా కళకళలాడుతోంది. మాల్యవంతపు రఘునాథుని ఆలయం నుంచీ రామరాయ సార్వభౌముని హజారం వరకూ చలువ పందిళ్లు వెలిసాయి. ఆ పందిళ్లలో జరిగే నృత్యగానాలు, రామభజనలతో ఊరంతా హోరెత్తింది. రాత్రంతా ఆ వీధులవెంట తిరుగుతూ, ఆడుతూ పాడుతూ, చలిదిబువ్వలు, వడపప్పు పానకాలు ఆరగిస్తూ ఆనందించింది ఏకపర్ణిక. నాలుగో జాములో ఎప్పుడో కుటీరానికి వచ్చి అలసటతో మగతనిద్రలోకి జారుకుంది.

''అమ్మీ! గండికోట తిమ్మానాయకులు వచ్చే వేళయింది,'' అన్న సిద్ధుని అరుపుతో మేల్కొంది. అప్పటికే బారున తెల్లారింది. ''ఏదో గంభీరమైన సమస్య గురించి చర్చించాలట, వర్తమానం చేసారు. ఆలయంలో పూజకి మండలం సిద్ధం చేయి,'' అంటున్నాడు సిద్ధుడు.

తిమ్మానాయకుడు వస్తున్నాడంటే అతడి వెంట మాధవుడు కూడా వస్తాడు. ఆమె మనసు ఎగిరి గంతేసింది. ఆనంద డోలికల్లో తేలిపోయింది. గబగబా లేచి సిద్ధుడు చెప్పిన పనులన్నీ ముగించేసింది. నదిలో స్నానమాడి, తెల్లని నూలు చీరె చుట్టుకుంది. విరగబూసిన మల్లెపొదల్లోని పూలన్నీ కోసి మాలలు కట్టి కొప్పులో సింగారించింది. అప్పటికే సమయం దాటిపోతోంది. పొదిలోని మంజిష్ట రసాన్ని నుదుటిపై తిలకంగా దిద్దుకుంటూనే కాళికాలయంలోకి ప్రవేశించింది. పూజకై సిద్ధంగా ఉంచిన అంజనాన్ని కొనగోట తీసి కనులకు దిద్దింది.

ఆమె అలంకరణలను చూసి తనలోతాను నవ్వుకున్నాడు సిద్ధుడు. నాయకుని దళపతితో ఆమె సాగిస్తున్న సరససల్లాపాలు అతడికి తెలుసు. ఆమె స్వైరిణి. పెళ్లీపెటాకులు లేని జోగిని. మనసైన మగాడితో తిరిగే స్వేచ్ఛ ఆమెకుంది. అందుకే ఎప్పుడూ అభ్యంతరం పెట్టలేదు.

అంతలోనే చిన్న పరివారంతో గుడిలోకి ప్రవేశించాడు తిమ్మానాయకుడు. సిద్ధునికి నమస్కరించి గుడి మండపంలో నేలపై ముగ్గుతో అలంకరించిన మండలానికి పశ్చిమ ముఖంగా కూర్చున్నాడు. దక్షిణ కోసం తెచ్చిన తాంబూలపు పళ్లేన్ని అతడి పక్కనుంచి అతడి పరివారమంతా గుడి నుంచి బయటకి వెళ్లిపోయారు. పళ్లెంలోని బంగారు నాణేలు చూడగానే సిద్ధుడి కళ్లు మెరిసాయి. అక్కడ సిద్ధుడూ నాయకుడూ తప్ప మరెవ్వరూ లేరు.

ఆమె మనసు మాధవుడి కోసం తపిస్తోంది. సిద్ధుని అనుమతితో బయటకి వెళ్లేందుకు సిద్ధమైంది. కానీ ఆగమన్నాడు సిద్ధుడు. నాయకుని వెనుకగా కూర్చొమ్మని సైగచేసాడు.

ఎందుకో ఆమెకి తెలుసు.

తిమ్మానాయకుని వెనుక నుండి, అతడు చెప్పే మాటలు శ్రద్ధగా వింటూ, అతడి సమస్యలకు సమాధానాలు తనకు యాదృచ్ఛికంగా వచ్చే కలలలో వెదకాలి. మాధవుడి వైపు తరలిపోతున్న మనసుని అదుపులో పెట్టి, అతడి మాటలు వినడం ప్రారంభించింది.

"విజయనగర సామ్రాజ్యంపై మరలా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. గత ఏడాది రామరాయ ప్రభువుల దెబ్బకి దిమ్మతిరిగి గోల్కొండ కోటలో దాగి గాయాలు మాన్పుకుంటున్న ఇభరాము పాదుశాహ మళ్లీ కుతంత్రాలకు దిగుతున్నాడు. విజాపుర అల్లీ అదలుశా (అలీ ఆదిల్ షా 1) మాత్రం మన ప్రభువు వారికి కొడుకులాంటి వాడు. అతడి నుంచి మనకు భయం లేదు. కానీ అతడు గత నెల్లో దౌలతాబాదు భైరి నిజాంశాహి కుమార్తెని పెండ్లాడిన మాట విన్నప్పటి నుంచీ నా మనసెందుకో కీడు శంకిస్తోంది. విజాపుర, దౌలతాబాదు సుల్తానులు గోల్కొండతో చేతులు కలిపితే మనకు ముప్పు తప్పదు. రామరాయ ప్రభువుల సామ్రాజ్యమంటే వాళ్లందరికీ కన్నెర్ర. దెబ్బతిన్న పులుల్లా అవకాశం కోసం వేచి ఉన్నారు," అంటూ సిద్ధునికి దక్షిణ సమర్పించాడు.

"మీరు మంత్రసిద్ధులు. భూత భవిష్యత్తులను చూడగల మహాతంత్రవేత్తలు. అంజనాలతోనో భూతబలులిచ్చో భవిష్యత్తు దర్శించగలరు. ప్రభువుకు, మా గండికోట రాజ్యానికి మీరే మార్గనిర్దేశం చెయ్యాలి."

"తమరి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలంటే మూడు మండలాల పాటు వ్రతం పట్టాలి." కొంత వ్యయంతో కూడుకున్నది అన్నట్లుగా చూసాడు సిద్ధుడు. తిమ్మానాయకుడు అతడికి బంగారుగుడ్లు పెట్టే బాతులా కనిపించాడు.

"అవసరమైన ధనం, సామాగ్రులు మాపటిలోగా మీకు చేర్తాయి." సిద్ధుడికి నమస్కరించి సెలవు తీసుకున్నాడు.

ఆ క్షణం కోసమే వేచి ఉన్న ఏకపర్ణిక తన ప్రియుడి సమాగమం కోసం గుడి బయటకి పరుగు తీసింది. నదీతీరంలో వాళ్లిద్దరూ ఏకాంతంగా కలుసుకునే చోట ఆమె కోసం అసహనంగా తచ్చాడుతూ ఎదురుచూస్తున్నాడు మాధవుడు.

పరుగున వెళ్ళి అతడి హృదయం పైన వాలిపోయింది. ఒకరి బాహువుల్లో ఒకరు శృంగారకేళిలో మేనులు మర్చిపోయారు. సూర్యుడు పడమట కుంగిపోయేదాకా వాళ్ళిద్దరికీ కాలం తెలియలేదు.

ఆ సాయంత్రం వెంటనే వచ్చి తన దర్శనం చేసుకోవల్సిందని మాధవుడికి నాయకుని నుంచి కబురొచ్చింది. మరునాడే గండికోటకు ప్రయాణమట. అలుము కుంటున్న యుద్ధ వాతావరణంలో రాజ్యాలన్నీ సైన్యాలను సమీకరించుకొని విజయదశమి నాటికి సిద్ధంగా ఉండాలని రామరాయ ప్రభువుల సోదరుడు తిరుమలరాయల నుంచి మహామండలేశ్వరులందరికీ ఆదేశాలు వచ్చాయి.

''ఇక కొంతకాలం ఎడబాటు తప్పదు,'' విచారంగా అన్నాడు మాధవుడు.

''నన్ను వదలి దూరంగా వెళ్ళి మీవాళ్ళ మధ్య నన్నట్లే మర్చిపోతావేమో?'' బెంగపడ్డది ఏకపర్ణిక.

''నీవలాంటి సంశయాలేవీ మనసులో పెట్టుకోకు. మనల్ని విడదీయడం ఎవరికీ సాధ్యంకాదు. నీపై నాకున్న ఇష్టం ఏ బంధాలకూ లొంగదు.''

ఏకపర్ణిక నుదుటిపై చుంబించాడు మాధవుడు.

దేవీ విగ్రహం ముందున్న నల్లదారం తెచ్చి మంత్రించి మాధవుని భుజానికి కట్టింది.

''ఈ యంత్రం నీ భుజానికున్నంతవరకూ ఎలాంటి కీడూ జరగదు. మనల్నెవరూ వేరు చేయలేరు. అంతా మంచే జరుగుతుంది. రాజ్యానికీ, మనకూ!''

విడలేక విడుస్తూ వెనుదిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు మాధవుడు.

ఇద్దరి భవిష్యత్తునూ ముడివేసుకుని కలలు కంటూ కంటినిండా నిద్ర పోయిందా రాత్రి ఏకపర్ణిక.

మబ్బులతో దోబూచులాడుతూ ఏవో దూరతీరాలకు సాగిపోతోంది ఆమె.

*

నల్లని రేగడి భూములను కోసుకుంటూ పాయలుగా విచ్చుకొని ప్రవహిస్తున్నదేదో పెద్ద నది. ఆ నది ఒడ్డున కనుచూపుమేర వరకు పరుచుకున్న మహానగరంలా సైన్య శిబిరాలు. మధ్యలో రాజమహల్లా ఉందొక పెద్ద శిబిరం.

యుద్ధభేరి మోగుతోంది.. సైన్యాలు ముందు కురుకుతున్నాయి. ఎదురుగా శత్రుసైన్యాలు మోహరించి ఉన్నాయి.

మరుక్షణంలో ఆ సైన్యాలు ఢీకొన్నాయి. హోరాహోరీ పోరు.

ఫిరంగులు, తోపులు. తెగిపడుతున్న తలలు, మొండేలు. గాయపడిన వారి హాహాకారాలు. అంత జరుగుతున్నా ఆమె మనసుని ఎటువంటి భయం కానీ వేదన కానీ తాకడం లేదు. దృశ్యం మాత్రమే! దూరం నుంచి చూస్తోంది, అంతే!

ఎవరికోసమో వెతుకుతోంది.

దూరంగా రామరాయ ప్రభువు పట్టపుటేనుగు రాజహంస. విజయనగరపు వాడలలో ఉత్సవాలలో చూసినదే. వెంటనే గుర్తుపట్టి అటువైపు సాగింది. హౌడాలో డెబ్బైయేళ్ల వృద్ధుడైనా నిటారుగా నిలిచి సైన్యాలను ఉరుకులెత్తిస్తున్న రామ రాయలు.

పక్కనే మరో ఏనుగుపై నలుగురు ధనుర్ధారులతో ప్రభువు వెన్ను కాస్తూ అనుసరిస్తున్నాడతడు. ఆ రూపం ఆమెకి పరిచయమే. కంచుతో చేసిన కవచ శిరస్త్రాణాలు వెనుక నుంచి కాస్తున్న ఎండలో ధగధగమని మెరుస్తున్నాయి.

అతడే... సందేహం లేదు! గండికోట భూపతి తిమ్మానాయకుడు.

వెనుకనే అనుసరించింది.

అంతలో... ఒక పక్కనుంచి ఫిరంగులు పేలసాగాయి. హాహాకారాలు మిన్నంటాయి. వందల సంఖ్యలో రాయల సైనికులు నేలకూలుతున్నారు. సైన్యా లను ఆ పక్కకి మోహరించేందుకు రామరాయలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు.

ఈలోగా విజాపుర పతాకాలతో అంబులవాన కురిపిస్తూ అల్లీ అదలశా (అలీ ఆదిల్ షా 1) అశ్వసైన్యం లోనికి చొచ్చుకొని వచ్చింది. వేలకొలదీ సైనికులు నేలకొరుగుతున్నారు. రామరాయలను కాపాడేందుకు అడ్డుగా నిలిచిన సోదరుడు వెంకటాద్రి మాలిక్-ఎ-మైదాన్ ఫిరంగి గుండుకి హతుడైయ్యాడు. తుపాకిగుండు తగిలి రామరాయల ఏనుగు ముందుకొరిగింది. రాయల సైన్యాలు కకావికలై పరుగెత్తుతున్నాయి.

విజయనగర ప్రభువు బందీ అయ్యాడు. సుల్తాను సైనికులు అతడిని సగౌరవంగా అల్లీ అదలశా (అలీ ఆదిల్ షా1) ముందు నిలబెట్టారు. సుల్తాను కన్నీళ్లతో ఆసనం దిగివచ్చి పితృసమానుడైన రామరాయలను ఆలింగనం చేసు కున్నాడు. సునాయాసమైన మరణం కావాలన్న రామరాయల కోరిక మేరకు స్వహస్తాలతో ఒకేవొక వేటుతో అతడి శిరస్సు ఖండించాడు.

రామరాయభూపాలుని రక్షణకై నడుంకట్టి అతడి ప్రాణాలు కాపాడజాలని బ్రతుకు వ్యర్థంగా భావించిన గండికోట తిమ్మానాయకుడు తన ప్రభువుతోబాటు స్వర్గారోహణ చేసేందుకు సుల్తాను అనుమతితో తన చేతితో తలను తెగ కోసుకునేందుకు కత్తినెత్తాడు.

మరుక్షణం అంతా చీకటి.

అంతవరకూ ఏ భావావేశం లేకుండా ఆ దృశ్యాలను తిలకిస్తున్న ఆమె గుండె ఎందుకో దడదడలాడసాగింది. తీవ్రమైన ఆందోళన ఆమెను చుట్టు ముట్టింది. తన ప్రియుడు మాధవుడి కోసం ఆమె కళ్లు వెతుకుతున్నాయి. ఎటు చూసినా పీనుగల గుట్టలు. యోజనం దూరందాకా ఆర్తనాదాలు చేస్తూ పారిపోతున్న సైనికులు.

మాధవుడెక్కడ?

గుండెల మీద ఏదో బరువు. శ్వాస ఆగిపోతోంది. 'మాధవా!' అని అరుస్తూ మేలుకుంది.

*

ఏకపర్ణిక మనసు మనసులో లేదు.

రోజులు గడుస్తున్నాయి. సిద్ధునితో తన కల గురించి చెప్పడమా? మానడమా? ఎందుకో ఆ విషయం ఆమెని మరింత ఆరాటానికి గురిచేస్తోంది. ఎవరేమైతే నాకేం? నా మాధవుడు క్షేమంగా ఉంటే చాలు. కాళికమ్మకి మొక్కు కుంది. విరూపాక్షస్వామికి ప్రియుడి క్షేమం కోసం అర్చనలు చేయించింది. వేయి దేవాలయాల నగరంలో ప్రతి దేవుడికీ తన మొర వినిపించుకుంది.

అతడు గండికోటకి వెళ్లి ఆరునెలలు గడిచాయి. మాధవుడు తన నుంచి దూరమౌతాడేమో అన్నదే ఆమె ఆలోచన. వివాహం చేసుకుంటానని మాటిచ్చాడు. అతడు మాట తప్పడు. ఆ నమ్మకం ఆమెకు ఉంది. కానీ తన కులం, గుర్తింపు వివాహానికి అడ్డు వస్తాయేమో అని దుఃఖపడింది. అవసరం తీరాక పాలకులు ఎంత క్రూరంగా నిర్దయగా ప్రవర్తిస్తారో ఆమె విన్నది. తన ప్రేమ పరీక్షకు నిలబడు తుందా? ఇప్పుడతడి ఇంట్లో ఆప్తుల మధ్య ఉన్నాడు. అతడి తల్లితండ్రులు తమ వివాహానికి అంగీకరిస్తారా? మాధవుడు ఒక దిక్కూదివాణం లేని స్త్రీని వివాహం చేసుకుని తీసుకువస్తే ప్రజల్లో వాళ్లకి తలవంపులు కాదా?

వాళ్ల స్థానంలో తానుంటే ఏమంటుంది?

ఈ వివాహం వినాశనానికే దారితీస్తుంది అంటుందా? మంత్రగత్తెలకు దివాణంలో స్థానం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తుందా? వర్ణసంకరం మంచిది కాదంటుందా? కులం గోత్రం తెలియని ఆమె అధమ వర్గానికి చెందుతుందని, అతడితో వివాహ ప్రతిపాదన హర్షించతగినది కాదని తేల్చి చెప్తుందా? ఈ వివాహం వినాశనానికే దారితీస్తుందని అతడిపై వత్తిడి తెస్తుందేమో? ఏమో? ఇలాంటి ప్రశ్నలతో అనుమానాలతో ఉక్కిరిబిక్కిరౌతూ మతిస్థిమితం కోల్పోసాగింది. పంపా తీరపు అందాలు ఇదివరకులా ఆమెను అలరించడం లేదు. నదీప్రవాహపు హోరు చికాకు పుట్టిస్తోంది. మంజిష్ట రంగులో తడిచి ఎప్పుడూ ఎర్రటి రంగులో మెరిసే ఆమె మునివేళ్లిప్పుడు బొమ్మలేయడం మరచిపోయాయి. నదివైపు వెళ్లడమే మానుకుంది. కుటీరంలో కూర్చుని మాధవుని రాక కోసం ఎదురుచూస్తోంది.

ఒకవేళ అతడి కుటుంబం వివాహానికి సమ్మతించకపోతే? మాధవుడు వాళ్లందరినీ ఒప్పించగలడా? పెళ్లికి అంగీకరించకపోయినా ఉంపుడుగత్తెగా తెచ్చుకునేందుకు అభ్యంతరం ఉండకపోవచ్చు. కానీ అతడి సహధర్మచారిణిగా జీవితాన్ని ఊహించుకొని ఇప్పుడొక ఉంపుడుగత్తెగా ఉండటమా? అతడికి ఇల్లాలు కాలేనప్పుడు ఏమైనా ఒకటే. తనకున్నది ఒకే కోరిక. అది తీరకపోతే తన జీవితానికి అర్థంలేదు. దేవీ ఆరాధకురాలిగా జీవితం వెళ్లదీయడమే మెరుగు. లేకుంటే ఏ వేశ్యావాటికలోనో తన జీవితం ముగిసిపోతుంది. అదీ కాదంటే ఒక మంత్రగత్తెగా ఈ జీవితాన్నిలాగే కొనసాగించి ఏనాడో ఒకనాడు నాలుక కోయించుకుని ఏ చెట్టుకో కట్టేయబడి కాలిపోతాను. అంతే!

కాళికాలయంలో దేవి పాదాలపైబడి మొరబెట్టుకునేది. 'అమ్మా! నా కోరిక అతి సామాన్యమైనది కాదా? నచ్చిన వీరుడ్ని వివాహం చేసుకుని కుటుంబజీవితాన్ని గడపాలని కలలు కనడం తప్పా? నాకు పుట్టే పిల్లలకు సమాజంలో గుర్తింపు కోరుకోవడం తప్పా? నేనెక్కడ పుట్టానో, నా తల్లిదండ్రులెవరో నీకే తెలియాలి. ఊరూరా తిరుగుతూ ఈ సిద్ధుని పంచన బ్రతుకున్నదాన్ని. నా మాధవుడే లేకుంటే నా జీవితం వృథా,' అంటూ దేవి పాదాలపై తలకొట్టుకుంటూ మూర్ఛపోయేది.

రోజురోజుకీ పిచ్చిదానిలా మారిపోతున్న ఆమెని చూస్తూ సిద్ధుడు మరింత ఆందోళన చెందుతున్నాడు. అతడి ఆందోళనకి కారణం వేరు. దేవీనవరాత్రులు

దగ్గరకొచ్చేస్తున్నాయి. తిమ్మానాయకుడు ఏ క్షణమైనా రావచ్చు. ఇప్పటికే అతడి నుంచి ప్రతాలూ, భూతబలులూ అని చాలా ధనం గుంజాడు. అతడి ప్రశ్నలకి సమాధానాలు అడిగితే చెప్పేందుకేమీ లేదు. ఆమె కలల గురించి ఎంత తరచి అడిగినా పిచ్చిదానిలా దిక్కులు చూస్తుందే తప్ప ఇదివరకులా స్పందించడం లేదు.

కాళికాలయంలో పడున్న ఆమె తలకి కట్టు కట్టి సపర్యలు చేశాడు సిద్ధుడు. మూడేళ్ల పసికందుగా ఆమెను ఎత్తుకువచ్చాడు. కళింగ మరాట్ట దేశాలు ద్రిమ్మరిలా తిరిగాడు. దాసిగా పనికొస్తుందనుకుంటే ఆమె అతీతశక్తి అతడిని ఒక మంత్ర సిద్ధుడిని చేసింది. అయినా ఇన్నాళ్లూ ఆమెనొక అవసరానికి పనికొచ్చే వస్తువుగానే చూసాడు. ఇప్పుడు ఏ మూలలోనో అతడిలో దాగిన వాత్సల్యం పెల్లుబికింది. ప్రియుని కోల్పోయిన ఆమె బాధ అతడిని కలచివేసింది. 'అమ్మీ! ఆ దళపతి తప్పక వస్తాడు. బాధపడకు,' ఓదార్చాడు. ఆ మాటలు ఆమెకి కొంత సాంత్వన చేకూర్చాయి. ఒంటరితనంతో కృంగిపోయిన ఆమెకు అతడి కనులలో కనిపించిన వాత్సల్యం కాస్త ఉపశమనాన్నిచ్చింది.

కలలో చూసిన యుద్ధవృత్తాంతాన్ని అతడికి విశదంగా వివరించింది. అదే అతడిని మృత్యుముఖానికి చేరుస్తుందని అనుకోలేదామె.

శరన్నవరాత్రులు రానేవచ్చాయి. సింహళం నుంచి కళింగం వరకూ ఉన్న రాజ్యాల మహామండలేశ్వరులు, సామంతభూపాలులు, అమరనాయకులు, పాలెగాళ్లు మహర్నవమి ఉత్సవాలకి రాజధానికి తరలి వచ్చారు. ఆనాటి ఉత్సవాలను విజయనగరం అంతకు మునుపెప్పుడూ చూడలేదు, మరెన్నడూ చూడబోదు.

ఏకపర్ణికా... అన్న పిలుపుతో పరుగిడుతూ కుటీరంలోంచి బయటకు వచ్చింది.

మాధవుడు కనిపించగానే విరహాగ్నిలో కృశించిన ఆమె శరీరానికి క్షణంలో నూత్నోత్సాహమనే నిండుతనం చేకూరింది. ఇంతకాలం తపించిన ఆమె బాధ అతడి ముఖంలో ప్రతిఫలించింది. నవరాత్రులు వారిరువురి శృంగారానికి శివరాత్రులయ్యాయి. శరీరాలు విడదీయలేనంతగా పెనవేసుకుపోయాయి. ఉత్సవంలో నగ్నంగా సిడిమానెక్కి నిమ్మకాయలు ప్రియునిపై విసురుతూ ఆమె పొందిన ఆనందం, ఆమె వీపుపై కొక్కెపు గాయాలను అతడు ముద్దిడినప్పుడు ద్విగుణీకృత

మయ్యింది. పంపాసరోవరంలో జలకాలాడుతూ పట్టబోయిన అతడి చేతుల నుంచి జారిపోతూ ఆమె ఒక మత్స్యకన్యగా మారింది. మలయకూటంపై గిరి వనాల్లో పక్షుల్లా విహరించారు, రతికేళిలో తేలియాడారు.

తొమ్మిది రాత్రులు తొమ్మిది క్షణాల్లా గడిచాయి.

మహర్నవమి వచ్చేసింది.

సిద్ధుని సమాధానం కోసం తిమ్మానాయకుడు ఆయన కుటీరానికి వచ్చాడు.

సంప్రదించ వచ్చిన తిమ్మానాయకుడిని సావధానపరిచే ప్రయత్నం చేసాడు సిద్ధుడు. యుద్ధంలో రాయల సైన్యాలకి ఓటమి తప్పదని చెప్పాడు. మహ ర్నవమినాడు రామరాయభూపాలునికి విశ్వాసప్రకటన ఏదోవొక నెపంతో ఠలా యించమన్నాడు. యుద్ధంలో జరగబోయే వినాశనాన్ని వివరంగా చెప్పాడు.

అతడి మాటలు నాయకుడి మనసుని కుంగదీసాయి. సిద్ధుని పట్ల అతడి నమ్మకం అటువంటిది.

కానీ కృష్ణరాయల స్వీయభృత్యుడు రామలింగదన్నాయకుడి కుమారు డతడు. విజయనగర సింహాసనం పట్ల పూర్తి విశ్వాసం అతడి ప్రతి రక్తం బొట్టులో ఉంది. అందుకే రామరాయల సోదరుడు తిరుమలరాయలను కలిసి సిద్ధుడు చెప్పిన భవిష్యవాణిని వివరించాడు. ఏదోవిధంగా ప్రభువును ఒప్పించి యుద్ధ నివారణకి ఉపాయాలు చూడమని ప్రాధేయపడ్డాడు.

అతడి మాటలకి తిరుమలరాయలు బిగ్గరగా నవ్వుతూ, ‘‘ఏం తిమ్మా నాయకా! ఈ పిరికిమందు నీకు నూరిపోసిందెవరు? ఆ కూటికిలేని సిద్ధుడా? ఆ ముసలోడి మాటలు నమ్మి ప్రభువుల ప్రతిభనే శంకిస్తున్నావా?’’ అని నిలదీసాడు.

‘‘పిరికితనం నా ఇంటావంటా లేదు,’’ అని చివ్వుమని తలెత్తాడు తిమ్మా నాయకుడు.

‘‘ప్రభుభక్తి పరాయణుడిగా చెప్పవలసింది చెప్పాను. కాగలదేదో దైవమే నిర్ణయించునుగాక! యుద్ధసమయంలో పగలూరాత్రీ కంటికి రెప్పవేయకుండా నా ప్రభువు వెన్నుగాస్తానని మా కులదైవం తిరువెంగళనాథుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను,’’ అంటూ ప్రతిజ్ఞ చేశాడు.

తిమ్మానాయకుని ప్రతిజ్ఞ వార్త ఊరంతా పాకింది. దానితోబాటూ సిద్ధుడు చెప్పిన భవిష్యవాణి కూడా. ఓటమిపాలు కానున్న మాట కొంతమంది నాయకు

లలో బెరుకు పుట్టించింది. యుద్ధ పరిణామాల నుంచి తప్పించుకునే మార్గాలు వెతకసాగారు. నగరప్రజలైతే సిద్ధుడి మాటలకి గగ్గోలు చెందారు. కొత్త కొత్త వదంతులు పుట్టాయి. అవి కోటలు దాటాయి. దేశాలు దాటాయి.

విజయదశమి వచ్చింది. సైన్యాలు కదిలాయి. పట్టపుటేనుగు రాజహంసపై రామరాయభూపాలుడు సేనలను ఉత్సాహపరుస్తూ తాను ముందు కదిలాడు. విజయ నగరంపై భయపు ఛాయలు మేఘాల్లా కమ్ముకున్నాయి.

*

మూడు నెలలుగా రోజుకొక వార్త.

అసలు యుద్ధమే లేదని, ముగ్గురు సుల్తానులు తమలో తామే తగవు లాడుకొని తిరుగుముఖం పట్టారని, తళ్లికోటలో కూటమి సైన్యం సమాయత్త మైందని, విజాపుర అల్లీ అదలశా (అలీ ఆదిల్ షా 1) రామరాయల పక్షంలో చేరాడని, అతడి సైన్యం తిరిగి వెళ్లిపోయిందని, విజయనగర సైన్యం సుల్తానుల సైన్యాలను చిందరవందర చేసి తరిమి వేసాయని, రాకసి తంగడి గ్రామాల మధ్య కృష్ణాతీరంలో రాయల సైన్యం విడిది చేసిందని, దౌలతాబాదు గోల్కొండ సైన్యాలతో యుద్ధం ముమ్మరంగా సాగుతోందని, రామరాయల ధాటికి సుల్తానుల సైన్యాలు పిక్కబలం చూపాయని, సుల్తానులు అదలశా ద్వారా సంధికి రాయబారం పంపారని, సంధి నేడో రేపోనని, జయం మనదేనని... రోజుకొక వార్త.

అవన్నీ నిజం కాదని ఆమెకి తెలుసు. తలారిగట్టు ఉత్తరపు వాకిలి వద్ద నిలిచి పగలూరాత్రీ ఎదురుతెన్నులు చూస్తోంది. సంక్రాంతి వచ్చి వెళ్లి పదిరోజులైంది. రోజురోజుకీ ఆమెలో ఆతృత పెరుగుతోంది.

పిడుగులాంటి వార్త!

సుల్తానుల మూకుమ్మడి దాడిలో విజయనగర సైన్యాలు ఓటమి పాలయ్యాయని, రామరాయలు ఫిరంగి గుండు పేలుడులో మరణించాడని, ఒక్కరూ మిగలకుండా ఊచకోతకు గురయ్యారని, సుల్తానుల తురకదండ్లు ఏ నిమిషాన్నైనా విజయనగరంపై పడవచ్చని... మరెన్నో వార్తలు. అన్నీ దుర్వార్తలే! భయాందోళనలు రగిలించేవే!

నగర ప్రజలు మూకుమ్మడిగా హడలిపోయారు. తురకల చేతజిక్కితే ప్రాణాలు దక్కవని, బతికుంటే బలుసాకు చాలని, చేతికందిన సంపదతో, బిడ్డాపాపలతో ఊరు విడిచిపోసాగారు. పదిరోజుల్లో నగరమంతా నిర్మానుష్యమైపోయింది.

తన ప్రియుడు మాధవుడు వస్తాడని ఎదురుచూస్తూనే ఉంది ఏకపర్ణిక.

దూరంగా ఏదో అశ్వికదళం. ఆమెలో ఆశ మొలకలెత్తింది. చావుదప్పి కన్నుబోయి దాదాపు వందమంది నమ్మకస్తులైన అంగరక్షకులతో నగరప్రవేశం చేసాడు రామరాయల సోదరుడు తిరుమలరాయలు.

ఒంటి కంటితో అతడు ఎదురుగా చూసిన మొదటి దృశ్యం- కొండ అంచున కాళికాలయం దాని పక్కనున్న సిద్ధుడి కుటీరం. ఆగ్రహంతో అతడి ఒంటి కన్ను నిప్పులుగక్కింది.

''ఆ సిద్ధుడే మన ఈ ఓటమికి కారణం. వాడు శత్రువుల బంటు. పుకార్లు సృష్టించి మన సైన్యాన్ని నిర్వీర్యం చేయడానికి వచ్చిన వేగులవాడు. వెంటనే వాడిని చిత్రవధ చేసి ఆ కుటీరాన్ని, గుడిని నామరూపాలు లేకుండా నాశనం చెయ్యండి,'' అని ఆజ్ఞాపించి నగరంలోకి కదిలాడు.

ఏంచెయ్యాలో తెలియక కాళికాలయం వైపు పరుగుదీసింది. అప్పటికే అక్కడికి చేరిన సైనికులు తాము ఓటమిపాలైన ఉక్రోషమంతా ముసలిసిద్ధుడి పై తీర్చుకున్నారు. అతడి నాలుకకోసి చిత్రహింసలు పెట్టి, కుటీరంతోబాటు నిప్పంటించారు. పలుగులతో పారలతో గుడిని పునాదులతో పెళ్లగించి ధ్వంసం చేసి సిద్ధుడి శిష్యురాలి కోసం వెతకడం ప్రారంభించారు.

ప్రాణభయంతో కొండమీదికి పారిపోయింది ఏకపర్ణిక.

ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ ఆకలిదప్పులతో ఆ బండరాళ్ల మధ్య తలదాచుకొని ఎన్నాళ్లుందో తెలియదు.

*

నిర్మానుష్యమైన నగరం విజయనగరం.

ఏకపర్ణిక ఒక్కర్తే తన ప్రియుడి కోసం వెదుకుతోంది. చుట్టూ నిలువెత్తు రాళ్లు, కొండమీద అక్కడక్కడ మంటపాలూ గుళ్లూ.

దూరంగా గలగలమని శబ్దం. పంపానది... రాళ్లూ రప్పలూ తొక్కుతూ నురగలు కక్కుతూ ప్రవహిస్తోంది. సంధ్యకాంతులు ఆకాశాన్ని వర్ణరంజితం చేస్తున్నాయి. ఆమె ప్రమేయం లేకుండానే కాళ్లు అటు కదిలాయి. నదీప్రవాహపు సవ్వడితో మనసును ఐక్యంచేసి నది వైపు పరుగిడుతోంది.

ఆమె కళ్లు మాధవుడి కోసం వెతుకున్నాయి.

కలలో కనిపించిన మాధవుడి కోసం. సజీవమై నిలిచి గుండెనిండుగా హత్తుకున్న మాధవుడి కోసం.

పరిగిడుతూనే వెనుకకి తిరిగి చూసింది. కూలిపడున్న కాళికాలయం. దాని పక్కనే కాలి బూడిదైన కుటీరం. ఇంకా పొగలు చిమ్ముతూనే ఉంది. అమ్మీ అని పిలుస్తున్న సిద్ధుని ముఖం కనులముందు కదిలింది. బాధతో మనసు చివుక్కు మంది.

మళ్లీ వెదుకులాట. నా మాధవుడు ఎక్కడ? బ్రతికే వున్నాడని, తనకోసం తప్పక వస్తాడని మనసు చెప్తోంది.

నది ఒడ్డున రావిచెట్టు. ఆత్మీయునిలా పలకరించింది. పసుపుపచ్చని పండుటాకులు గాలికి రాల్తున్నాయి.

దూరంగా అతడు. వెనుదిరిగి నిలబడ్డ అతని వీపు కన్నీరు నిండిన ఆమె కనులముందు అస్పష్టంగా కనిపించింది.

ఇది కలగాదుకదా?

మాధవా... అని అరుస్తూ నదిగట్టు వైపు పరుగెత్తసాగింది.

*సాయి పాపినేని సౌజన్యంతో*
*కాలయంత్రం-2020 కథాసంకలనం నుండి*
*మే 2021*

❋



22 డిసెంబర్ 1975న చిత్తూరు జిల్లాలో జన్మించిన **ఝాన్సీ పాపుదేశి** మొదటి కథ **దేవుడమ్మ** సారంగ వెబ్ పత్రికలో 17 జులై 2013న ప్రచురితం. ఇరవైకి పైగా కథలు రాసారు. 11 కథలతో దేవుడమ్మ కథాసంపుటి ప్రచురించారు. నివాసం బెంగుళూరు.

***Email: papudesijc@gmail.com***